


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

# (గత సంచిక తరువాయి)

మరో రెండు రోజులు గడిచాయి. ఎవరి మనస్సులో ఏముందో ఎవరికీ తెలియదు కానీ, ఇంటిల్లి పాదీ రాజు పెళ్లిపనులు చెయ్యటానికి సిద్ధపడ్డారు, సరళతో సహా. అప్పటి వరకు ఇంట్లో అంటీముట్టనట్లున్న సరళ రాజేశ్వరి పెళ్ళి నిర్ణయమయ్యాక అందరితో కలిసి పోవటం మొదలు పెట్టింది. ఇంట్లో వారి ఘర్షణను, బాధను అర్ధం చేసుకున్నది ఆమె. తోటి కోడలుతో కూడా అరమరికలు లేకుండా మెలగటం మొదలు పెట్టటంతో అందరు కొంచెం ఆనందించారు. శారద కూడా సరళ ను ఆత్మీయంగా చేరదీసింది.

ఆ రోజు పొద్దున్నే ఇంటికి వెల్ల వేసే వాళ్ళు వచ్చారు. కదల్చగలిగే సామానులు నట్టింటికి జరిపి వాటి మీద సున్నం పడకుండా పాత బట్టలు కప్పే పనిలో ఉన్నారు శారద, హైమవతి. పార్వతీశంగారు అక్కడే కూర్చుని మధ్య మధ్య హైమవతిని అడుగుతూ పచారీ సామాన్ల జాబితా ఆఖరిసారి సరి చూసుకుంటున్నారు. పాలేళ్ళు వెనకాల దొడ్డంతా శుభ్రం చేస్తున్నారు. వెనకున్న పశువుల పాక నుంచీ, దొడ్డి గుమ్మం వరకు అక్కడక్కడా పెరిగిన పిచ్చి మొక్కలు పీకి పారేసి, ఒక మూల గాడి పొయ్యి తవ్వటానికి స్థలం సిద్ధం చేస్తున్నారు. ముందు వాకిలి నించి ఇంటివరకు ఉన్న సిమెంట్ చెప్టా మీద భారతి, సుశీలా సుద్ద ముక్కతో ముగ్గులు వేసి దానిపై రంగులద్దుతున్నారు. శయనమ్మగారు పక్కనే ఉన్న రంగనాథ స్వామి గుడి ధర్మకర్త గారు పంపిన మేళగాళ్ళతో పెళ్ళిలో వాయించవలసిన కీర్తనల గురించి మాట్లాడుతున్నారు. మగపిల్లలు అటకల పైనుంచి వంటవాళ్ళిచ్చిన జాబితా ప్రకారం కావలసిన ఇత్తడి గుండిగలు, గంగాళాలు, గోకర్ణాలు, పచ్చళ్ళ గుత్తులు, వడ్డించటానికి పెద్దపెద్ద పళ్ళాలు వంటి సామానులు దింపుతున్నారు. అవి తోమి వంట వాళ్లకు ఇవ్వాలి. పెళ్ళికి వ్యవధి తక్కువ ఉండటంతో చుట్టు పక్కల ఊళ్లలోని మిత్రులను, దూరపు బంధువులను పిలవటానికి మనుషులను పంపే సంగతి ఆలోచిస్తున్నారు కృష్ణ, సరళ. ఇల్లంతా సందడి, సందడి గా ఉంది.

ముగ్గులు దిద్దుతున్న భారతి, సుశీలా ఒక్కసారి లేచి నిలబడి పోయారు చేష్టలుడిగి. వాళ్ళ తరువాత చూపు అటు తిరిగింది శయనమ్మగారికి. ఆవిడా స్థాణువులాగా నిలిచి పోయింది. అందరూ గుమ్మం వైపు చూసిఅలాగే ఉండిపోతుండటంతో పార్వతీశంగారు లేచి అటు వచ్చారు. ఎదురుగా మెడలో దండలతో, మెరుస్తున్న మాంగల్యంతో రాజేశ్వరి, పక్కనే నాగరాజు. నిర్విణ్ణులయ్యారు పార్వతీశం. ఒక్క క్షణం అలాగే రాజేశ్వరి వైపు చూస్తూ ఉండిపోయాడు. తన పెళ్ళి గొడవ మొదలైన దగ్గర నుండి తండ్రికి ఎదురు పడటానికి భయపడ్డ రాజేశ్వరి నిస్సంకోచంగా, నిర్భయంగా ఆయన కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసింది. భారతికి రాజేశ్వరి తల్లితో 'నీకు నాన్నకు మీ చేతులతో పిల్ల గొంతును కోశామనే బాధను కలగనీయనమ్మా' అనటం గుర్తొచ్చింది. పార్వతీశంకి కూడా అవే మాటలు గుర్తొచ్చాయి.

"హైమావతీ, హారతి పట్టుకురా, నీ పెద్ద కూతురూ, అల్లుడూ వచ్చారు" అన్నాడు పార్వతీశం పెద్దగా. ఈలోగా శారద, సరళ మిగిలిన వాళ్లంతా వరండా మెట్లు దిగి అక్కడికి వచ్చారు. అలాగే నిలబడిపోయిన హైమవతిని చూసి, పరిస్థితి ఆకళింపు చేసుకున్న భారతి గబుక్కున ఇంట్లోకి నడిచి దేవుడి ముందున్న హారతిని ఒక పళ్లెంలో పెట్టి తీసుకు వచ్చి హైమవతి చేతుల్లో పెట్టింది. సరళ వచ్చి హారతిపళ్ళెం తను కూడా పట్టుకోగా హైమవతి మరబొమ్మలాగా రాజేశ్వరికి, నాగరాజుకు హారతి ఇచ్చింది. ఈలోగా శయనమ్మగారు రెండు కుర్చీలు అక్కడ వేయించారు. అందులో కూర్చున్నారు కొత్త దంపతులు. పాలేళ్ళకీ, మేళగాళ్ళకీ అక్కడ జరుగుతున్నది ఏమీ అంతు పట్టలేదు. ఇంటిసభ్యులే తెల్ల మొహాలు వేసిన ఆ పరిస్థితిలో అక్కడ ఉండాలో, వెళ్ళాలో అర్థంకాక వెర్రి మొహాలు వేసి చూస్తున్నారు వాళ్ళు. అందరిలోకీ ముందుగా తేరుకుంది పార్వతీశం గారే. ఆయన అక్కడే ఉన్న మురారిని చూస్తూ,

"వెళ్ళి రవి మావయ్యను పిలుచుకు రారా!" అన్నాడు గంభీరంగా. మురారి ఒక్క పరుగున లోపలి వెళ్ళి రవిని వెంటబెట్టుకుని వచ్చాడు. రవి అన్నదమ్ములు ముగ్గరిలోకీ నెమ్మదస్థుడు. బావగారు రమ్మనగానే భయపడుతూ వచ్చాడు. శారదమ్మ తెల్లబోయి చూస్తోంది.

"శారదమ్మా నా కోరిక ఒకటి తీర్చాలి నువ్వు, నా చిన్న కూతురు భారతిని నీ రెండోమరిది రవికి ఇద్దామనుకుంటున్నాను. నీకు సమ్మతమేనా?" ఉబ్బి తబ్బిబ్బయ్యింది శారదమ్మ. ఉలిక్కిపడ్డాడు రవి. భారతి సంగతి చెప్పనే అక్కరలేదు. ఆమెకు ఏం జరుగుతోందో కూడా అర్థం కాలేదు. నీళ్ళు నిండిన కళ్ళతో పార్వతీశం వంక చూసింది శారద.

"దేవుడు వరమిస్తానంటే కాదనే భక్తురాలు ఉంటుందా అన్నయ్యా? సిరి రా మోకాలడ్డుతానా?" అంది జోడించిన చేతులతో.

"ఏరా రవీ?" రవి ఆశ్చర్యపోతూ భారతి వంక చూసాడు. భారతి జరుగుతున్నది అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తోంది. రవి పేరు వినగానే తనకే తెలియకుండా కళ్ళెత్తి అతన్ని చూసింది భారతి. ఇంత హఠాత్తుగా ఇదేంటి అని ఆలోచిస్తున్న రవికి, భారతికి ఒకేసారి పార్వతీశం మనసు అర్థమయ్యింది. ఇప్పటివరకూ ఇద్దరికీ పెళ్ళి ఆలోచనే లేదు. కానీ ఒకళ్ళ కళ్ళల్లోకి ఒకళ్ళు చూసుకున్న ఆ మహత్తర క్షణం ఎలాంటిదో ఏమో భారతి మనసు ఆమె కళ్ళల్లోనే చదివెయ్య గలిగాడు రవి.

"ఇష్టమే" అన్నాడు చిన్న చిరునవ్వుతో. అతని కళ్ళల్లోని మెరుపు భారతి బుగ్గల్లోకి పాకి ఆమె వైపు ఆమె అంగీకారం కోసం చూసిన పార్వతీశంకి అడక్కుండానే జవాబు దొరికింది. గాఢంగా నిట్టూర్పు విడిచిన ఆయన ఉచ్ఛస్వరంతో

"నా చిన్న కుమార్తె చి.ల.సౌ భారతికి, నా బావమరిది చి. రవికి వివాహం జరపటానికి నిశ్చయమైంది." అన్నాడు. ఈలోగా కొబ్బరి చెట్టుకి పాకిన తమలపాకు తీగ నుండి మూడు ఆకులను తెంపి, ఇంట్లోంచి తెచ్చిన అరటిపళ్ళు, వక్క, పసుపు కుంకుమ పెట్టి తాంబూలం సిద్ధం చేసింది శయనమ్మగారు. శారద ఉద్వేగంగా తోటి కోడలు సరళ, మరిది కృష్ణలను పిలిచి ఆ తాంబూలాన్ని వారి చేతులమీదుగా పార్వతీశం, హైమవతులకు ఇప్పించింది. వెంటనే పార్వతీశం తన మెడలోని కండువాను తీసి కృష్ణ మెడలో వేసి తాంబూలాన్ని సతీసమేతంగా ఉన్న కృష్ణ చేతిలో పెట్టాడు. రవిని ఒక్కసారి ఆత్మీయంగా హత్తుకున్నాడు. కూతురి భుజం మీద తట్టాడు.

అక్కడే చేష్టలుడిగి నిలబడ్డ అందరినీ "ఏమిటలా చూస్తున్నారు? మొదలు పెట్టిన పనులు కానివ్వండి. చిన్నమ్మాయి పెళ్ళి కుదిరింది కదా." అని హెచ్చరించాడు. అప్పటివరకు బొమ్మల్లా నిలబడిన వారు ఎవరి పనులలో వాళ్ళు జొరబడ్డారు.

"చిన్నతల్లీ , లోపలకి వెళ్ళి అక్షింతలు తీసుకు రావమ్మా" భారతి నుద్దేశించి అన్నాడు పార్వతీశం. లోపలకు పరిగెత్తుకు వెళ్ళింది భారతి. అక్షింతలు తీసుకు వచ్చింది.

"రావమ్మా ముసలమ్మగారూ, నా పెద్దకూతురు, అల్లుళ్ళని ఆశీర్వదిద్దాం. శారదా, కృష్ణ, సరళా అందరూ రండి "అంటూ హైమవతి చేతిలో అక్షింతలు పెట్టి ఆమెతో కలిసి మొదటిగా నాగరాజు, రాజేశ్వరిల తలల మీద వేశాడు పార్వతీశం. నాగరాజుని ఆత్మీయంగా కౌగలించుకుని "చిరకాలం సుఖంగా ఉండండి బాబూ. పిల్లా పాపలతో చల్లగా వర్ధిల్లండి." అని మనస్ఫూర్తిగా దీవించాడు. అన్నాళ్ళ కోపం ఎటుపోయిందో, హైమవతి కూతురిని గాఢంగా కౌగిలించుకుంది. ఆమె కళ్ళవెంట ధారలుగా కారిన కన్నీళ్ళని  రాజేశ్వరి గమనించింది.

తరువాత అంతటా ఆనందం వెల్లి విరిసింది. హైమవతి, పార్వతీశం గార్లు కూతురినీ, కొత్త అల్లుడినీ ఎర్రనీళ్ళు దిగతుడిచి ఇంట్లోకి తీసుకువెళ్ళేప్పుడు అక్కడే ఉన్న మంగళవాయిద్యాల వాళ్ళు శక్తి కొద్దీ వాటిని మోగించారు. పెళ్లికని సిద్ధం చేసిన చీరలను, పెళ్ళి కొడుకుకని కొన్న బట్టలను, ఇతర సామాగ్రిని ఒక పెట్టెలో సర్దించారు పార్వతీశంగారు. కూతురు కివ్వవలసిన నగలను అంతకుముందే సిద్ధం చేసి ఉంచింది హైమవతి. వాటిని మరో పెట్టెలో పెట్టించి, వెండి సామాను అందులో ఉంచింది. అందులో కొంత డబ్బును కూడా ఉంచారు పార్వతీశంగారు. వంటవారిచేత బంధువుల కోసం చేయించిన పిండివంటలన్నీ బుట్టలలో సర్దించి వాటిని వెంట తీసుకువెళ్ళింది హైమవతి పసుపు, కుంకుమలతో.

"అల్లుడుగారూ, పదండి. ముందు మీ అమ్మా నాన్నల ఆశీస్సులు తీసుకోవాలి. తరవాతే ఏదైనా" అని వాళ్ళను అప్పటికప్పుడు కొబ్బరాకులు కట్టి అలంకరించిన రిక్షాలో కూర్చుండ బెట్టి, మంగళ వాయిద్యాలతో, ఇంటిల్లి పాదీ వెంటరాగా శ్రీనివాసులు, అలిమేలు ఇంటికి తీసుకు వెళ్లారు పార్వతీశం, హైమవతులు.

## 27

అదృష్ట వశాత్తు రాజేశ్వరి పెళ్ళిముహూర్తం అనుకున్న మర్నాడే భారతి పెళ్ళికి ముహూర్తం కుదిరింది. రాజేశ్వరి పెళ్ళికని మొదలైన సందడి భారతి పెళ్ళిదయ్యింది. ఇంట్లో ఎవరికీ రాజు అలా ఎందుకు పెళ్ళి చేసుకుందో అర్థం కాలేదు. ఊహించగలిగిందల్లా సుశీల, పార్వతీశమే.

అనుకోకుండా పెళ్ళి నిశ్చయమవటంతో భారతి తబ్బిబ్బవుతోంది. టీచర్ ట్రైనింగ్ అయిన భారతికి ఈమధ్యే సుశీల, శయనమ్మ గార్లను చూసి జీవితంలో ఏదన్నా సాధించాలనే ఆశయానికి బీజం పడింది. అయితే ఏం చెయ్యాలి అని ఓ నిర్ణయానికి ఇంకా రాలేదు. తన పెళ్ళి గురించి తండ్రి ఇంత తొందరగా నిర్ణయం తీసుకుంటాడని ఆమె ఎన్నడూ అనుకోలేదు. నిజానికి రాజు అలా పెళ్ళి చేసుకుని రాకపోతే పార్వతీశం ఇప్పట్లో భారతి పెళ్ళి గురించి ఆలోచించే వాడే కాడేమో! ఈ సమయంలో తన మనసుకు ఎంతో దగ్గరైన శేషు తనతో లేకపోవటంతో భారతికి మనసులో మాట చెప్పుకునేందుకు ఎవరూ లేకపోయారు.

భారతి శేషుకి వెళ్ళేటప్పుడు వీలైనప్పుడల్లా ఉత్తరాలు రాస్తూ ఉండమని చెప్పింది. కానీ అన్నివేళలా అది కుదరదని ఆమెకీ తెలుసు. అతనినుంచి ఉత్తరం వచ్చిన రోజు ఇంట్లో అందరికీ పండుగే. ఒక్కోసారి చిరునామా ఇస్తూ అక్కడికి ఉత్తరం రాయమంటాడు శేషు. కానీ అతను తన మొదటి ఉత్తరంలో వ్రాసినట్లు అవి అతనికి చేరేదాకా నమ్మకం లేదు. ఒక్కోసారి కేవలం తన విశేషాలు తెలుపుతూ రాస్తుంటాడు. ముఖ్యంగా భారతికి ఆ ఉత్తరాలు ఎంతో ఇష్టం. తాను చూడని ప్రదేశాల గురించి శేషు వర్ణిస్తూ రాస్తుంటే భారతికి అవన్నీ తన కళ్ళతో చూసినట్లే అనిపిస్తుంటుంది. శేషు చిరునామా ఇస్తేమటుకు వెంటనే జవాబు రాస్తుంది భారతి. అతనికి అవి ఎప్పుడు అందినా తమ అందరితో ఉన్న భావనను కలుగచేస్తాయని భారతికి తెలుసు.

"నామీద ప్రేమ కురిపించటంలో ఆ ఇంట్లోని ప్రతి ఆడమనిషి, ఆఖరికి నువ్వు కూడా తల్లివే. నువ్వే కాదు ఆకలికి అలమటిస్తుంటే తన పాలతో నా ఆకలి తీర్చిన గోమాత కూడా నా మాతే. ఇంతమంది ప్రేమతోనే నేనింత వాడి నయ్యింది. ఆ రోజు నువ్వు చెప్పిన మాటలు ఇప్పుడు అర్థమయ్యాయి నాకు." అని ఒక ఉత్తరంలో రాశాడు శేషు. "ఇప్పుడు అమ్మమనసు కూడా నేను అర్థం చేసుకోగలుగుతున్నాను. ఆవిడ మీద నాకేమీ అసంతృప్తి కానీ, కోపం కానీ లేవు." ఆ మాటలు చదివిన భారతి కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. ఆ ఉత్తరం చూసిన శారద ఏడ్చేసింది.

పెళ్ళి కుదిరిందన్న వార్తతోపాటు ఆ సందర్భంగా తన మనసులోని అయోమయాన్ని, భయాలను పంచుకుంటూ భారతి తన దగ్గరున్న శేషు చిరునామాకు ఉత్తరం రాసింది, శుభలేఖ పంపుతూ. కానీ అవి అతనికి అందుతాయనే నమ్మకం ఆమెకు లేదు. ఆమె మనసు కారుమబ్బులు కమ్మిన ఆకాశంలా ఉంది. ఆప్యాయంగా చూసుకునే అక్క దూరమై

పోయింది. సుశీలతో ఎంత దగ్గరితనం ఉన్నా అందులో స్నేహం పాలు కంటే, గౌరవం పాలే ఎక్కువ. ఇద్దరికీ దగ్గర దగ్గర పదేళ్ళ వ్యత్యాసం మరి వయసులో.

పెరట్లోని బావిదగ్గర బట్టలు ఉతికే చాకలి ఇంటివెనుక కట్టిన తీగల మీద ఆరవేసి పోతుంది. అవి ఆరిన వెంటనే ఎవరో ఒకరు తెచ్చి ఒక నవారు మంచం వేసి దానిపైన పడేస్తే వాటిని ఇంట్లో ఆడవాళ్ళు ఎప్పుడు కుదిరితే అప్పుడు మడతలుపెట్టి అలమరలలో సర్దేస్తుంటారు. భారతి ఆ సాయంత్రం బట్టలు మడతవేసి, సర్దేసింది. అన్యమనస్కంగా డాబా మీదకి పాకిన మల్లెతీగను చూస్తూ దానికీ ఆకులు దూయాలేమో అనుకుంటూ మెట్లెక్కింది. అక్కడక్కడా ఉన్న మల్లెమొగ్గల్ని తెంపి, సజ్జలో వేసి, పరధ్యానంగా అస్తమించే సూర్యుడిని చూస్తూ ఉండి పోయింది. ఇప్పుడు శేషు ఉంటె ఎంత బాగుండేది? తన మనసులోని ఆలోచనలు అతనితో పంచుకునేది కదా!

డాబాపై ఆ మూల రవి ఉన్నది గమనించనే లేదు భారతి. అతను కూడా తన ఆలోచనలలో మునిగి ఉన్నాడు. భారతి వచ్చిన అలికిడికి ఇటు తిరిగాడు. మల్లె మొగ్గల్ని కోస్తూ, మధ్యలో ఆపేసి సూర్యుడిని చూస్తున్న భారతి అతని కళ్ళకి ఎంతో అందంగా కనిపించింది. కొంచెంసేపు ధ్యాన సమాధిలో ఉన్నట్లున్న ఆమెను పలకరించడం ఇష్టంలేనట్లు చూస్తూ ఉండిపోయాడు రవి. లేతఆకుపచ్చ పరికిణీకి ఉన్న కుంకుమరంగు అంచు కిందనుంచి సుకుమారమైన పాదాలు కనిపిస్తున్నాయి. కుంకుమ రంగు వోణీ ఆమె ఒంటిపై మెరుస్తోంది. ఆకుపచ్చ జాకెట్టుకు, చేతికున్న ఆకు పచ్చ మట్టి గాజులు జత కలిసి ఆమె పచ్చని మేనిఛాయను ద్విగుణీకృతం చేశాయి. ముక్కున ఉన్న రవ్వ ఆ సందెవెలుగులో తళుక్కున మెరుస్తోంది. చెంపకు చారెడుకళ్ళు, పల్చని చెక్కిళ్ళు, సన్నని పెదవులు! రవి ఏనాడూ ఆమెను పరిశీలనగా చూడలేదు. ఇప్పుడు మొదటిసారి చూస్తుంటే అతని మనసులో ఏవో మధుర భావనలు కలుగుతున్నాయి. కానీ అంతలోనే వేయి సందేహాలు.

"భారతీ!" అప్పటికే ఏదో అలికిడి విన్నట్టనిపించి ఇటు తిరిగిన భారతి అతన్ని చూసి, ఆ పిలుపు విని ఒక నిమిషం తడబడిపోయింది. రవి రెండడుగులు ముందుకు వేసాడు..

"నాదో చిన్న సందేహం." ఏమిటన్నట్లు చూసింది భారతి.

"నీకు నన్ను పెళ్ళి చేసుకోవటం ఇష్టమే కదా! బావ అడిగాడని ఒప్పుకున్నావా?"

చిన్న నవ్వు విరిసింది భారతి పెదవుల మీద." నీకో? మన పెళ్ళి ఇష్టమేనా లేక అత్తయ్య మీద గౌరవంతో చేసుకుంటున్నావా? " అంది. తన ప్రేమ కళ్ళల్లోనే వ్యక్తమయ్యేలా చూసాడు రవి ఆమె వైపు.

"ఇంతకు ముందు ఎప్పుడూ అలా ఆలోచించలేదు. కానీ బావ అడిగిన తరవాత నా అంత అదృష్టవంతుడు లేడనిపిస్తోంది."

"నాకూ అదే అనిపిస్తోంది."

"ఏమనిపిస్తోంది?"

"నీ అంత అదృష్టవంతుడు లేడని మావయ్యా..." కొంటెగా అని పరిగెత్త బోయింది భారతి. గబుక్కున ఆమె చెయ్యి పట్టుకున్నాడు రవి మొదటి సారి. ఝల్లుమంది భారతి ఒళ్ళు. విడిపించుకో బోయింది. రవి వదల లేదు.

"మన పెళ్ళి గురించి లక్ష సందేహాలు, కోటి అనుమానాలు. అనుకోకుండా ఇంత తొందరలో పెళ్లంటే..."

"నాకు మటుకూ లేవనా? కానీ నీ మీద నమ్మకం." చిన్నగా జవాబిచ్చింది భారతి. రవి మనసు గర్వంతో పొంగిపోయింది ఆమె మాటలకు.

"మనం పెళ్ళైన వెంటనే మాట్లాడుకుందాం మావయ్యా! నాకు జీవితంలో కొన్ని ఆశయాలున్నాయి. వాటిని పంచుకునే వ్యక్తిని పెళ్ళి చేసుకోవా లనుకున్నాను. ఈ లోగా మనపెళ్ళి కుదిరింది. నువ్వే నా ఆశయ భాగస్వామివని, నాన్నగారి రూపంలో దేముడు మనపెళ్ళి కుదిర్చాడేమో! అయినా మనం ఒక్కసారి అన్నీ మాట్లాడుకుంటే బాగుంటుంది." తన మనసులోని మాట చెప్పేసింది భారతి. రవి ముగ్ధుడయ్యాడా మాటలకి.

"తప్పకుండా." అంటూ ఆమె చేతిని తన పెదవులతో ముద్దాడి వదిలేసాడు. సిగ్గుల మొగ్గై కిందకు పరిగెత్తింది భారతి. ఇద్దరికీ ఒకరి పట్ల ఒకరికి మనసులో ఉన్న సందేహాలు చాలా వరకు మాయమై పోయినట్లనిపించింది. భారత దేశంలో పెళ్లిళ్లు ఆ రోజుల్లో చాలావరకూ ఇలాగే జరిగేవి. పెద్దలే కుదిరిస్తే పిల్లలు మారు మాట లేకుండా పెళ్ళాడేవారు. రాజేశ్వరి పెళ్ళివంటి పెళ్ళిళ్ళు చాలా అరుదు.

★★★★★

రాజేశ్వరి అత్తగారింట్లో మూడు నిద్రలు పూర్తి కాగానే పుట్టింటికి వచ్చేసింది. చెల్లెలి పెళ్ళి పనులలో చురుగ్గా తిరగ సాగింది. పార్వతీశం గారు మగ్గాల మీద నేసిన వెండి జరీ చీరలు అమ్మే వారిని ఇంటికి పిలిపించారు. ఆడవారంతా అక్కడ చేరారు. అతని దగ్గర ఉన్న చీరలన్నీ బయటకి తీయించారు. వాటిని కిందేసి పైనేసి, అటు తిప్పి ఇటు తిప్పి ఇంట్లో అందరికీ తలా ఒక రెండు చీరలు తీసుకున్నారు. పెళ్ళి కూతురికి ఐదు పట్టు చీరెలు ఎంచారు. ఇంకా అవీ ఇవీ అంటూ మరో ఐదు చీరెలు చేరాయి భారతికి. అంతా అయిపోయిందనుకున్న తరువాత పార్వతీశం గారు నా ముగ్గురు బంగారు

తల్లులకీ అంటూ కూతుళ్ళిద్దరికీ, సుశీలకీ చిక్కని కనకాంబరం రంగులో బంగారు జరీ చీరెలు కొన్నాడు. ఈ తంతంతా చూసి నవ్వుకుంటున్న మగవాళ్ళలో ఉన్నాడు రవి. అతని కళ్ళు గంధం రంగు జరీ చీర మీదనే నిలిచి పోవటం గమనించింది భారతి.

"అత్తా, నాకీ చీరె కొనవూ" అంది గారంగా శారద దగ్గర చేరి.

"నీకెన్ని కావాలో అన్ని కొనుక్కోవే బంగారం!" అంది శారద. ఆ చీరె కూడా కొనిపించుకుంది భారతి. రవి మోహంలో వెలుగు స్పష్టంగా కనిపించింది ఆమెకు. చాలా అన్నట్లు ఒక కొంటెనవ్వు విసిరింది.

కంసాలిని ఇంటికి పిలిపించి పెళ్లికూతురి నగలు పురమాయించారు. రాజేశ్వరికి చేయించినట్లుగానే అన్ని నగలూ పురమాయించారు భారతికి. సుశీలకీ పనిలో పనిగా నగలు చేయించబోతే రెండు చేతులు ఎత్తి దణ్ణం పెట్టింది.

"మీరు చేయించినా నేను ఒక్క నగ కూడా వేసుకోను బాబుగారూ, నన్ను వదిలెయ్యండి." అంటూ. సుశీల తల్లి నగలు బోలెడు ఉన్నా, ఒక్కనాడూ పెట్టుకుని ఎరగదు. అది గుర్తొచ్చి తన ప్రయత్నం ఆపాడు పార్వతీశం. శారదకి అత్తగారిచ్చిన నగలు కూడా నాలుగో వంతు భారతికి పెట్టే వాటిలో వచ్చి చేరాయి.

శారద, హైమవతి, శయనమ్మ, సుశీల కలిసి వంటావిడ సహాయంతో ఎర్ర అప్పడాలు, వడియాలు, ఊరు మిరపకాయలు, కందిపొడి, గోంగూర పచ్చడి, కొత్త ఆవకాయ, మాగాయ, మామిడికాయ ముక్కల పచ్చడి వంటివి సిద్ధం చేశారు పెళ్ళికి. పెళ్ళి కూతురు జాకెట్లన్నీ దర్జీ కి వెళ్లాయి. పెళ్ళి సందడి అందరింటికి కూడా పాకింది. అక్కడ ఉన్న మామిడి చెట్ల నించి మండలు తెంపి తోరణాలు తయారు చేశారు అందులో ఉన్న వారు. గాబుల నిండా నీరు నింపటం వారి పనే. ఇక విడిది కూడా అందరిల్లే. పెళ్ళికి ఓ వారం ముందే శారద, సరళ, కృష్ణ, రవి, ప్రసాద్ లు ఆ ఇంటికి మారి పోయారు. శయనమ్మ గారు మటుకు పెళ్లికూతురు వైపే. తన ప్రియమైన మనవరాలికి రోజుకో రకం పూల జడ వేస్తోందావిడ. రోజుకో రకం అలంకరణ చేస్తోంది. చేసి భారతి చెయ్యి పట్టుకుని రవి దగ్గరకి లాక్కు పోయి

"చూసుకో బాబు, పెళ్ళికూతురు నచ్చిందా?" అంటూ అతని ముందు నిలబెడుతుంది. భారతి సిగ్గుల మొగ్గవుతుంది.

పెళ్ళికి ఐదు రోజుల ముందే ఇంటి ముందు తాటాకు పందిరి వేశారు. పందిట్లో జంబుఖానాలు, కుర్చీలు వేశారు. ఇంటికంతటికీ మావిడి తోరణాలు కట్టారు. పందిట్లో పిల్లలు తాటాకు బూరలు తెగ ఊదుతూ గోల గోల చేస్తున్నారు. ఊరికే పరుగులు తీస్తూ కాళ్ళకి, చేతులకి అడ్డం వస్తున్నారు. ఇంటి వెనకాల తవ్విన గాడి పొయ్యి మీద మరుగుతున్న పులుసు వాసన గాలిలో తేలి వచ్చి నోరూరిస్తోంది.

పెళ్ళి రేపనగా ఈ రోజు రవిని పెళ్ళి కొడుకుని చేసి, వెంటనే భారతిని పెళ్ళి కూతుర్ని చేశారు ఆ రోజు. ముదురు ఎరుపు రంగు ముద్దజరీ చీరలో ముద్దు లొలుకుతోంది భారతి. కంటికి పెట్టిన కాటుక, కళ్యాణం బొట్టు, బుగ్గన చుక్క, కాళ్ళకు పారాణి అసలే అందమైన భారతిని మరింత కళకళలాడేలా చేశాయి. ఇక కొత్త పంచెలో మెళ్ళో చంద్రహారంతో తో బుగ్గన చుక్కతో కళకళలాడుతున్నాడు రవి. ఇద్దరినీ గుమ్మం దాటటానికి లేదన్నారు పెద్దలు. దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలే అన్నట్లు పార్వతీశం ఇంట్లో పెళ్లంటే అందరికీ సందడే. ఇరుగు పొరుగు వచ్చి వీధి వీధంతా రంగవల్లులు తీర్చి దిద్దారు. పెళ్ళి ఊరేగింపుకి పెట్రోమాక్స్ లైట్ లను సిద్ధం చేశారు. ఎక్కడినించో ఒక కారు పెళ్ళికొడుకు ఊరేగింపు కోసం సిద్ధం అయ్యింది. పెళ్ళి కూతురి కోసం ముత్యాల పల్లకిని సిద్ధం చేస్తున్నారు. పార్వతీశం గారి ఇల్లు, 'అందరిల్లు' సర్వాంగ సుందరంగా అలంకరింపబడ్డాయి.

పెళ్ళి కూతురికి గాజులు వేసేందుకు వచ్చాడు గాజుల మలారంతో ఒక పెద్దఆయన. రకరకాల పూల గాజులు, కొత్తరకం గాజులు, రంగురంగుల గాజులు అక్కడున్న ఆడవాళ్ళందరూ ఎగబడి వేయించుకున్నారు. పెళ్ళికూతురికి ఒక చేతికి పదకొండు గాజులు, మరో చేతికి పన్నెండు గాజులు వేయించారు ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో. గాజుల మలారంకి, గాజులు వేసిన తాతకి నమస్కారం పెట్టించి భారతి చేతుల మీదుగా డబ్బులు, కొత్త పంచెలు ఇప్పించారు. ఆ తరువాతి రోజు పసుపు, చందనం, జవ్వాది వంటివన్నీ కలిపి నలుగు పెట్టి స్నానం చేయించారు. బంగారు బొమ్మలా మెరిసి పోతోంది భారతి. సరళ, సుశీల ఆమెను ఆపాద మస్తకం అలంకరిస్తున్నారు. ఇక ఆ మర్నాడే పెళ్లి. ఇంటినిండా చుట్టాలు. "అందరిల్లు"కూడా నిండి పోయింది. రోడ్డు మీద తాటాకు పందిరి వేసి దాని కింద భోజనాలు వడ్డించారు అందరికి. ఆ రాత్రి ఇంటిల్లిపాదికీ ఏదో ఒక పని ఉంటూనే ఉంది ఎవరూ పడుకున్నది లేదు. పందిరి కింద వరుసగా పక్కలు పరిచి అందరూ పడుకున్నారు. ఎవరికో, ఏదో గుర్తు వస్తుంది. వెంటనే అడుగుతారు.

"పాలు తోడు పెట్టావా వదినా" ఉన్నట్లుండి అడుగుతుంది హైమవతిని వరసకి మరదలైన ఆవిడ. వెంటనే లేస్తుంది హైమవతి.

"ఇందాక వేడిగా ఉన్నాయని చన్నీళ్ళ పళ్లెంలో మూత పెట్టి వచ్చాను. తోడు పెట్టినట్టు లేను "అంటూ. ఆవిడ లేచి రెండడుగులు వేసేలోగా రాజు అంటుంది.

"అమ్మా, నన్ను తోడు పెట్టమని అన్నావుగా. నేను పెట్టాలె."

"ఔను కదా" అనుకుంటూ పడుకుంటుంది హైమవతి. ఈ సారి ఆమెకే అనుమానం." ఒసే రాజూ, వంటలక్క సత్యవతి గారిని ఐదింటికల్లా రమ్మనమని చెప్పమన్నా. ఎవరన్నా చెప్పుంటారా?"

గదిలో ఆ మూల నుంచి పార్వతీశం జవాబు వినిపిస్తుంది." నేను కబురు పంపాలే" ఈ విధంగా ఆ రోజు తెల్లవార్లూ కలత నిద్రే అందరికీ.

ఆ రోజుల్లో పెళ్ళి సందడే సందడి. పెళ్ళికి ముందో పది రోజులు, వెనకో పది రోజులు బంధు బలగం ఉండి, అన్ని సక్రమంగా జరిపించి మరీ వెళ్లేవారు. చూస్తూండగానే పెళ్ళి రోజు వచ్చేసింది.

పొద్దున్నే పెళ్ళి సందడి మొదలయ్యింది. భారతిని తెల్లవారకుండానే హడావిడిగా లేపేశారు. అందరూ కలిసి వేడి నీళ్లు పెట్టి, నలుగుకు అన్నీ సిద్ధం చేసి, వేసుకోవాల్సిన బట్టలు ఒకరు, నగలు ఒకరు సిద్ధం చేసి, పూల జడ కుట్టడానికి సర్వం తెచ్చి గబగబా స్నానం చేయించేశారు. తడిగా ఉన్న జుట్టును సాంబ్రాణి పొగ వేసి ఆరబెట్టారు. ఆరిన జుట్టుని చిక్కులు తీసి నడి నెత్తిన నాగరం పెట్టి, అసలే పొడవైన జుట్టుకి సవరం పెట్టి పెద్ద జడ అల్లి చివర జడకుప్పెలు పెట్టారు. ఆ జడ పైన అందంగా పూలు కుట్టి పూల జడ వేశారు. బొట్టు, కాటుక, బుగ్గన చుక్క, కాళ్లకు పారాణి పెట్టి అలంకరించారు. నడినెత్తి దాకా పూలు పెట్టారు. ఆపైన తల్లి పెళ్ళి కూతురుని చేసి పెట్టిన చీరను కట్టించారు. ముందుగా అమ్మకీ నాన్నకీ, ఇంట్లోని పెద్దలకి దణ్ణాలు పెట్టించి ఆ పైన అక్కడున్న ముత్తైదువలందరికీ దణ్ణాలు పెట్టించారు. తాంబూలాలు ఇప్పించారు. తమ చిన్నారి భారతి పెళ్ళి కూతురై తమ ముందు నిలిస్తే హైమవతి, పార్వతీశంల కళ్ళల్లో ఆనంద బాష్పాలు నిండాయి. రాజేశ్వరి భారతిని గట్టిగా కౌగిలించుకుంది. విడిదింట రవిని కూడా పెళ్లికొడుకుగా అలంకరించారు. శారద ఆనందానికి అంతే లేదు. పదే పదే రవి బుగ్గలను పుడికి ముద్దు పెట్టుకుంటోంది.

ఇక పురోహితుడు వచ్చి వివాహవేదిక దగ్గర చేరి అందరినీ హడావిడి పెట్టటం మొదలు పెట్టాడు. ఒక ఇద్దరిని ఆయనకు కావలసినవి అందించటానికి నియమించాడు పార్వతీశం.

“అమ్మా, కాడి సిద్ధం చేశారా? పిల్లవాడికి, పిల్లకీ భాషికాలు కట్టారా? మొన్న కామేశ్వరరావు గారింట్లో మర్చిపోయారు లెండి. తలంబ్రాల బియ్యం సిద్ధమేనా? కాళ్ళు కడుగు చెంబు,పళ్లెం? మంగళసూత్రాలు ఎక్కడఉన్నాయి? పిల్లవాడి ఉత్తరజంధ్యాలు దగ్గర పెట్టుకున్నారా? మేనమామ బట్టలు?" ఆయన అడిగేవాటన్నిటినీ అందిస్తున్నారు తగిన జవాబులు చెప్తూ. తదుపరి కార్యక్రమం చకచకా సాగిపోయింది. గౌరీ పూజ, కన్యార్ణవాలు, పెళ్ళి కూతురిని అప్పటికే పెళ్ళికొడుకు కూర్చుని ఉన్న పెళ్ళి వేదిక మీదకు కొత్తబుట్టలో కూర్చోపెట్టి మేనమామలైన కృష్ణ, ప్రసాద్ మోసుకురావటం ఇద్దరి మధ్య తెరసల్లా పట్టటం, సరిగ్గా ముహూర్తం వేళ్టికి కాళ్ళు కడిగి కన్యాదానం చెయ్యటం, శుభదృష్టి, మాంగల్య ధారణ, తలంబ్రాలు, ఆశీర్వచనం వంటి వన్నీ ఒకదాని వెనుక ఒకటి వరుసగా జరిగిపోయాయి. కృష్ణ, ప్రసాద్ కలిసి భారతిని బుట్టలో మంటపానికి తెచ్చినందుకు మగపెళ్ళివారి తరఫున శారదే బట్టలు పెట్టి సత్కరించింది. అలాగే అంతకు ముందు కాశీ యాత్ర సందర్భంలో, బావగారిని కాశీకి వెళ్లొద్దని, తన చెల్లినిచ్చి పెళ్ళి చేస్తానని నచ్చచెప్పి వెనక్కితెచ్చిన పెద్ద

బావమరిది ముకుందానికి పట్టుబట్టలు పెట్టింది శారద. మేనమామ పిల్లకి ఇవ్వవలసిన మధుపర్కాలను కృష్ణ, సరళ అందజేశారు.

భారతి చేతులు పాలల్లో ముంచి అప్పగింతలు జరిపించేటప్పుడు పార్వతీశంగారి కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. ఈనాటి నుంచి భారతి ఇక ఈ ఇంటి పిల్ల కాదు. "ఆడపిల్ల ఎప్పటికైనా ఆడ పిల్లేగా" అన్న పెద్దల మాట ఆయనకు అప్రయత్నంగా గుర్తువచ్చింది. శయనమ్మగారు భారతి, రవిలకు పెళ్ళి కానుకగా ఇచ్చిన వస్తువును చూసి అందరూ ఆశ్చర్యానందాలకు లోనయ్యారు. వెండితో  చేయించిన భరతమాత స్వతంత్ర భారత దేశపు మువ్వన్నెల జండాను చేత ధరించి ఉంది.

"దేశమాత సేవలో జన్మలను చరితార్థం చేసుకోండి" అని దీవించిందామె వారిద్దరినీ. వచ్చిన చుట్టపక్కాలు, మిత్రులు ఇచ్చిన కానుకలు, కొత్తకాపురం పెట్టటానికి కావలసిన వస్తువులన్నింటినీ సమకూర్చాయి నూతన వధూవరులకు.

అప్పగింతలు చీకటి పడ్డాక ఆ రాత్రి చేశారు. నాగవల్లి, స్థాలీపాకం కూడా అయ్యాక గృహప్రవేశం చేయించి ఆపాడు పురోహితుడు. కాసేపు విశ్రాంతి తీసుకుంటే, తెల్లవారాక వ్రతం అన్నాడు.

అప్పగింతలు ముందే జరిగిన విందు భోజన కార్యక్రమంతో అందరి కళ్ళూ మూసుకు పోతున్నాయి. అందరూ ఎక్కడివారక్కడ తలలు వాల్చారు. పురోహితుడు ఇంకా బ్రహ్మముడిని విప్పక పోవటంతో భారతి, రవి కూడా అక్కడే అందరితో పాటు నిద్రలోకి జారుకున్నారు.

మర్నాడు శారదమ్మ ఇంట్లో సత్యనారాయణ స్వామి వ్రతం జరిగింది. పార్వతీశం గారి కోరిక మేరకు రాజేశ్వరి, నాగరాజులు కూడా భారతి, రవి జంటతో పాటు పీటల మీద కూర్చున్నారు. రెండు జంటలు చక్కగా వ్రతం చేసుకున్నాయి. వ్రతం ముగిసే వేళ్టికి భోజనాల ఏర్పాట్లు జరిగాయి.

బంతి మొదట్లో రవి, భారతి, వారి పక్క రాజేశ్వరి, నాగరాజు, వారి పక్క అలిమేలు, శ్రీనివాసులు కూర్చున్నారు. తీరా వడ్డనలు వచ్చేసరికి మిగిలిన వరుస అంతా ఖాళీగా ఉంది. వారికి ఎదురు వరుసలో, వెనుక వరుసలో, పక్క వరుసలో అందరూ కూర్చున్నారు. ఇంకా కొందరు భోజనాలకు ఎదురు చూస్తున్నారు కానీ ఖాళీగా ఉన్న ఈ పంక్తిలో మటుకు కూర్చోలేదు. వాళ్ళు చూసుకో లేదేమోనని, ముకుందం చెప్పాడు పెళ్ళికూతురు వాళ్ళు కూర్చున్న దగ్గర ఖాళీ ఉందని.

"ఫరవాలేదులే బాబూ, మేము ఉంటాంలే,"అన్నారు. ఎంత మందికి చెప్పినా ఇదే జవాబు. మురారికి అర్థం కాలేదు. నాగరాజు పక్కన కూర్చున్న అలిమేలు "రండయ్యా. ఈడ ఎవరూ లేరు" అని ఇద్దరు ముగ్గురిని పిలిచింది. వారు

విననట్లే మొహం తిప్పుకుని వెళ్ళారు. దాంతో విషయం అర్ధమయ్యింది వాళ్ళకి. వాళ్ళు ఇది మామూలే అన్నట్లు ఉన్నారు కానీ రాజేశ్వరి మొహం అవమానంతో జేవురించింది. విస్తరి ముందు నుంచి లేవబోయింది. నాగరాజు ఆమె చెయ్యిని పట్టి ఆపాడు. ఈలోగా విషయం శయనమ్మకు చేరింది. ఆమె వెంటనే అందరిల్లుకి వెళ్ళి అక్కడ ఉన్న వారిని వెళ్ళి రాజేశ్వరి వాళ్ళ పక్కన కూర్చుని భోజనం చెయ్యమని పంపింది. దానితో ఆ విషయం పెద్దది అవ్వలేదు. భోజనాలు ప్రశాంతంగా ముగిశాయి

భోజనాల తరువాత వ్రతం చేయించిన బ్రాహ్మణుడికి కొత్తబట్టలతో పాటు దక్షిణ తాంబూల మిచ్చి రెండు జంటలను దణ్ణం పెట్టమన్నాడు పార్వతీశం. అయన పాదాలకు ముందుగా భారతి, రవి నమస్కరించి ఆశీర్వాదాలు పొందాక రాజు, నాగరాజులు వంగబోయారు.

"ఫరవాలేదమ్మా. ఒక తాంబూలమిచ్చారుగా. మళ్ళీ ఎందుకు" అంటూ ఆయన వారి తలపై అక్షింతలు వేసి దీవించేసాడు. ఇది ఎవరు అంతగా పట్టించుకోబోయినప్పటికీ రాజేశ్వరి గమనించింది. ఆమెకు అవమాన మనిపించింది కళ్ళ వెంట నీళ్లు తిరిగాయి కానీ తమాయించుకుంది. తండ్రి పరపతికి భయపడో, తండ్రి మీద భక్తి తోనో అందరూ ఊరుకుంటున్నారు గానీ తాను నాగరాజుని పెళ్ళి చేసుకోవటం అన్నది వారెవరూ మనసారా అంగీకరించలేదని, ఈ పెళ్ళి ద్వారా తన కులమూ మారిపోయిందని ఆమె గ్రహించింది.

శారదమ్మ ఇంట్లో మూడు నిద్రలు ముగిశాక పార్వతీశం ఇంట్లో శోభన కార్యక్రమం ఏర్పాటు చేశారు పెద్దలు. దంపతు లందరికీ దంపతి తాంబూలాలు ఇప్పించారు. అప్పుడు కూడా రాజేశ్వరిని బ్రాహ్మడు పిలవక పోతే పార్వతీశం,

"అమ్మా, పెద్దల్లుడూ, నువ్వూ రండి" అని తానే ఆహ్వానించటంతో ఎవరూ, ఏమీ అభ్యంతరం చెప్పలేకపోయారు. చిన్నబుచ్చుకున్న రాజేశ్వరి మొహం చూసి విలవిలలాడింది పార్వతీశం మనసు. ఆ బాధను గ్రహించింది సుశీల. ఓదార్పుగా పార్వతీశం పక్కన నిలిచింది.

★★★★★

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS